సాక్షి
చిత్తూరు
బుధవారం । 1 । నవంబర్ । 2023



మీ ఇంటి ఆడబిడ్డను ఆదరించండి

'మీ ఇంటి ఆడబిడ్డను సారెతో మీ ఇంటికి వచ్చాను. నా భర్త భరత్‌ను ఆదరించండి.' అని భరత్ సతీమణి దుర్గ కోరారు. - 8లో



బతుకు కూడలి

భవన నిర్మాణాలకు ఎంత మంది కూలీలు కావాలన్నా చిత్తూరు మార్కెట్ చౌక్ వెళితే సులువుగా దొరుకుతారు. - 8లో



అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు జిల్లా పోలీసుశాఖ కొవ్వొత్తులతో నివాళులర్పించింది. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లాలో బుధవారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఈ నెలకు సంబంధించి ప్రభుత్వం 1,339 చౌక దుకాణాల పరిధిలోని 5,31,019 కార్డులకుగాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యంతోపాటు కందిపప్పు, గోధుమ పిండి, చక్కెర, రాగులు అవసరమైన మేరకు సరఫరా చేశామన్నారు. కార్డుదారులు రేషన్ పంపిణీ వాహనాల ద్వారా ఇంటి వద్దే సరుకులు పొందవచ్చని పేర్కొన్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూతలపట్టు ఎస్‌ఐ బి.సురేష్‌ను పలమనేరు అర్బన్‌కు, పలమనేరులో ఎస్‌ఐ బీవీ సుబ్బారెడ్డిని కుప్పం అర్బన్‌కు, కుప్పం ఎస్‌ఐ కేబీ శివకుమార్‌ను రామకుప్పానికి, బంగారుపాళెం ఎస్‌ఐ ఎం.రాంభూపాల్‌ను పూతలపట్టుకు, యాదమరి ఎస్‌ఐ వి.సుమన్‌ను రాళ్లబుదుగూరుకు, రాళ్లబుదుగూరు ఎస్‌ఐ డి.మునస్వామిని చిత్తూరు వేకెంట్ రిజర్వు (వీఆర్)కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పలు రోడ్ల మరమ్మతు పనులకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హై ఇంపాక్ట్ పనుల కింద పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో ఈ రోడ్డు పనులను చేయనున్నారు. చిత్తూరు అర్బన్, గుడిపాల, పలమనేరు, వి.కోట, రామకుప్పం, శాంతిపురం ప్రాంతాల్లో మొత్తం 22.73 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతుకు రూ.31.64 కోట్లు మంజూరు చేసింది.


నేడు కాణిపాకంలో సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు పర్యాయాలు ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు వరసిద్ధివినాయక స్వామివారు స్వర్ణ రథంపై ఆలయ మాఢవీధుల్లో విహరించనున్నట్లు తెలిపారు. వ్రతానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వారు పేర్కొన్నారు.

3న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో నవంబర్ 3న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 3 ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. సుమారు 400కు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

జీరో డోర్ నంబర్ ఓట్లను పరిశీలించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జీరో నంబర్‌తో నమోదైన ఓట్లను పరిశీలించి, డిసెంబర్ 7వ తేదీలోపు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో 10 కి పైగా ఓటర్లు ఒకే డోర్ నంబర్‌లో నమోదై ఉంటే పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఫారం - 6, 7, 8 దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ప్రక్రియ జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో జేసీలు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఓటరు జాబితా నుంచి ఓటు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు ముందుగా నోటీసు ఇవ్వనున్నట్లు చెప్పారు. నోటీసుకు సరైన సమాధానం ఇవ్వకపోతే ఈఆర్వో స్థాయిలో ఓటు తొలగించే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అక్టోబర్ 30 నాటికి జిల్లాలో ఒకే డోర్ నంబర్‌తో 10 మంది చొప్పున 842 మంది ఉన్నట్లు చెప్పారు. తప్పులు లేని తుది ఓటర్ల జాబితాకు చర్యలు చేపడుతున్నట్లు జేసీ తెలిపారు.





సెజ్‌కు కేటాయించిన భూముల్లో సర్వే చేస్తున్న తహసీల్దార్, సర్వేయర్, ఇతర అధికారులు (ఫైల్)

వెనుకబడిన నియోజకవర్గం.. కరువుకాటకాలకు నిలయం.. అభివృద్ధికి ఆమడదూరం.. నాలుగేళ్ల క్రితం ఆ అసెంబ్లీ నియోజకవర్గం పగ్గాలను ఓ నేత చేతికిచ్చారు అక్కడి ప్రజలు. దీంతో ఆయన అభివృద్ధిని పరుగులు పెట్టించారు. పారిశ్రామిక ప్రగతి పథంలో నియోజకవర్గాన్ని నడిపించి, తన విద్యుత్ ధర్మం నిర్వర్తించారు. ఫలితంగా నేడు ఆ ప్రాంతానికి ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ వచ్చింది. అదే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న పుంగనూరు.

విద్యుత్ ధర్మం నిర్వర్తించారు!

- పుంగనూరులో ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ
- ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషి ఫలితం
- రూ.4,640 కోట్లతో జర్మన్ పెప్పర్ కంపెనీ నిర్మాణం
- 8 వేల మందికి ఉపాధి

పుంగనూరు: నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి పరంగా పరుగులు తీస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు పుంగనూరులో ఎలక్ట్రికల్ బస్సుల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రూ.4,640 కోట్లతో జర్మన్ పెప్పర్ కంపెనీ దీనిని స్థాపనకు ముందుకొచ్చింది. పరిశ్రమ ఏర్పాటైతే 8 వేల మందికి నేరుగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమ ఏర్పాటు

మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డి గ్రామాల్లో ఇండస్ట్రియల్ కారిడార్‌కు సుమారు రెండు వేల ఎకరాలను మంత్రి, ఎంపీ కేటాయించారు. ఈ ప్రాంతంలో ఎలక్ట్రికల్ బస్సుల నిర్మాణ కంపెనీకి స్థలాన్ని ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఇక్కడ శ్రీకాళహస్తికి చెందిన స్టీల్ ఫ్యాక్టరీ పనులు చేస్తున్నారు. అలాగే గ్యాస్ సిలిండర్ల ఫ్యాక్టరీకి స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ బస్సు పరిశ్రమకు ఆమోదం లభించడంతో పారిశ్రామిక ముఖచిత్రం మారుతోంది.

సరిహద్దుల్లో అభివృద్ధి

పుంగనూరు నియోజకవర్గం గత 3 దశాబ్దాలుగా కరువు కాటకాలతో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి, ఎంపీ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. నాలుగున్నరేళ్లలో అభివృద్ధిని పరుగులు తీయించారు. పరిశ్రమల ఊసేలేని పుంగనూరులో పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. కర్ణాటక, తమిళనాడుకు సరిహద్దుల్లో ఉన్న పుంగనూరు అభివృద్ధి చెందడంతో వ్యాపార లావాదేవీలకు కేంద్రంగా మారింది. ముఖ్యంగా నీటి సమస్య తీర్చేందుకు పుంగనూరులో ఆవులపల్లె, నేతిగుట్లపల్లె ప్రాజెక్టులు మంజూరు చేశారు. ఈ విషయాలపై ఎంపీ మిథున్‌రెడ్డి పారిశ్రామికవేత్తలతో చర్చించడం..వారు పరిశ్రమల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించడం నిరుద్యోగులకు వరమైంది.

ప్రజల ఆర్థిక స్థితిగతుల మెరుగే లక్ష్యం



"మా కుటుంబానికి అండగా ఉన్న పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగు పరచాలన్నదే మా లక్ష్యం. 30 ఏళ్లుగా జరగని అభివృద్ధిని చేసి చూపిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు, పరిశ్రమలు కేటాయించడంతో పుంగనూరుకు గుర్తింపు లభించింది. ప్రజలకు అవసరమైన అన్నింటినీ శక్తివంచన లేకుండ పూర్తి చేస్తాం .

– మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నిరుద్యోగులను ఆదుకుంటాం



నిరుద్యోగులకు గత ప్రభుత్వంలా కల్లబొల్లిమాటలు చెప్పకుండా వారి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ముఖ్యమంత్రి జగనన్న ఆశీర్వాదంతో సరిహద్దుల్లో ఉన్న పుంగనూరు నియోజకవర్గంలో రెండు రిజర్వాయర్లు, గండికోట నుంచి పైపులైన్లు ద్వారా నీటి సమస్య పరిష్కరిస్తున్నాం. పరిశ్రమలకు అవసరమైన నీరు పుష్కలంగా లభిస్తుండడంతో పారిశ్రామికవేత్తలు పుంగనూరుకు రావడం ఆనందంగా ఉంది. ప్రజలకు, నిరుద్యోగులకు ఉపాధి లభించే మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం.

– పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

ఎల్‌పీఏ రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఏ) ఆధారిత రిజిస్ట్రేషన్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రిజిస్ట్రేషన్ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌పీఏ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో ఎల్‌పీఏ ఆధారిత 22ఏ జాబితా అప్‌లోడ్ చేయాలన్నారు. ఆ జాబితా ఆధారంగా 22ఏ జాబితాను సవరించాలని తెలిపారు. జిల్లాలో రీ సర్వే మొదటి విడతలో 132 గ్రామాలు, రెండో విడతలో 91 గ్రామాల్లో పూర్తి అయినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, పలువురు సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

కల్యాణం..వైభోగం



స్వామి,అమ్మవార్ల కల్యాణం

రాపూరు: ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా పెంచలకోన క్షేత్రంలో మంగళవారం పెనుశిలక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణం నిర్వహించారు.

బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు

- క్షతగాత్రులను వేలూరు, చీలాపల్లె సీఎంసీలకు తరలింపు



బోల్తాపడ్డ బస్సు



108 అంబులెన్స్‌లో క్షతగ్రాతుల తరలింపు

గుడిపాల: మండలంలోని చిత్తూరు–వేలూరు రహదారిలో ఓ ప్రైవేట్ బస్సు మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 20 మందికి పైగా గాయపడ్డారు. డ్రైవర్‌తో పాటు ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బాలాజీ ట్రావెల్స్ ఎన్‌ఎల్01 బి7979 నంబర్ బస్సు తమిళనాడు రాష్ట్రం పుదుచ్చేరి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గం మధ్యలోని పల్లారు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 33 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు బోల్తా పడిన సమయానికి వేలూరు సీఎంసీ ఆస్పత్రి నుంచి చిత్తూరుకు 108 అంబులెన్స్ వస్తుండడంతో వెంటనే 108 సిబ్బంది శివ గుడిపాల పోలీసులకు సమాచారం అందజేశారు. 108 అంబులెన్స్ ద్వారా వేలూరు సీఎంసీ ఆస్పత్రికి, గుడిపాల మండలంలోని చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి మరి కొంతమందిని చికిత్స నిమిత్తం తరలించారు. సికింద్రాబాద్‌కు చెందిన లలిత(47)కు మెడభాగం, కాళ్లు విరిగాయి. డ్రైవర్‌కి కూడా తీవ్రగాయాలు తగిలినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి హుటాహుటిన మూడు 108 అంబులెన్స్‌లు వచ్చి గాయాల పాలయిన వారిని తక్షణమే ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలియజేశారు. సంఘటన స్థలానికి జిల్లా శిక్షణ కేంద్రం డీఎస్పీ శ్రీకాంత్ చేరుకుని రోడ్డు పైన ఉన్న బస్సును పక్కకు తొలగించే ఏర్పాట్లు చేశారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

- అర్హత ఉన్న ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి
- గడప గడప కార్యక్రమంలో మంత్రి రోజా



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రోజా



మంత్రి రోజాను సత్కరించి ఆహ్వానిస్తున్న మహిళలు

పుత్తూరు రూరల్: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీ ఒకటో వార్డు పల్లూరు సచివాలయ పరిధిలోని పాత పల్లూరు, కొత్తతిమ్మాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రికి ఇంటింటా మహిళలు కర్పూర హారతులిచ్చి, శాలువలు కప్పి సన్మానించి, స్వాగతం పలికారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అవ్వా పింఛన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆరోగ్యశ్రీ పథకం ఆదుకునిందా? అమ్మఒడి చదువు చెబుతోందా? అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం జగనన్న ప్రభుత్వంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించే చంద్రబాబు, తర్వాత ప్రజలను మోసం చేస్తారని, అదే ఆయన నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం చేశారని, ఇదీ వైఎస్సార్ కుటుంబం నైజమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇలా పలు విధాలుగా ప్రజలకు చేయూతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జగనన్న కోసం జనసైనికురాలిగా పనిచేయడానికి తాను సిద్ధమని, మీరు సిద్ధమా? అని ప్రశ్నించారు. అందరూ ముక్తకంఠంతో తామూ సిద్ధమేనంటూ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలియార్, కౌన్సిలర్లు గుణ, ఏకాంబరం, బాలసుబ్రమణ్యం, జానికెనడీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లారీ మోహన్, మనోహర్‌రెడ్డి, జయచంద్ర, ఈశ్వరయ్యయాదవ్, తిరునావక్కరసు, గోపీ, చక్రి తదితరులు పాల్గొన్నారు.

పటేల్ సేవలు చిరస్మరణీయం



ప్రతిజ్ఞలో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

- కలెక్టర్ షణ్మోహన్.. ఎస్పీ రిశాంత్‌రెడ్డి
- చిత్తూరులో దిగ్విజయంగా ఐక్యత పరుగు



ప్రతిజ్ఞ చేస్తున్న యువత

చిత్తూరు అర్బన్: దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన్ని భారతావని ఎప్పటికీ మరవదని కలెక్టర్ ఎస్.షణ్మోహన్ అన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి నేపథ్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు పురస్కరించుకుని మంగళవారం చిత్తూరులోని గాంధీ విగ్రహం నుంచి పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వరకు రన్ ఫర్ యూనిటీ (ఐక్యత కోసం పరుగు) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి జెండా ఊపి, ప్రారంభించారు. ఈ పరుగులో యువత, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తరువాత పటేల్, రాజుల పాలనలో ఉండే కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలను దేశంలో కలిపేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి సమగ్ర భారతదేశానికి తుదిరూపు ఇచ్చారన్నారు. దాదాపు 550కి పైగా స్వతంత్య్ర రాజ్యాలను భారత్‌లో కలిపి ఐక్య భారత్ నిర్మాణానికి కృషి చేశారన్నారు. ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చాక భారతదేశానికి మొట్టమొదటి హోం మంత్రిగా సేవలందించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశ రక్షణ, సమగ్రత కోసం పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అధికారులు విధుల్లో నిబద్ధతతో పనిచేయాలన్నారు. విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. దేశ రక్షణ, సమగ్రత కోసం ఆయన చేసిన కృషికే ఉక్కుమనిషి అనే గుర్తింపు వచ్చిందన్నారు. పోలీస్ సిబ్బందిలో ఐక్యతాభావం పెంపొందేలా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్‌లో భాగంగా రన్ ఫర్ యూనిటీలో పాల్గొని, విజేతలుగా నిలిచిన వారికి కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎల్.సుధాకర్, బి.శ్రీలక్ష్మి, జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేపటి నుంచి కాణిపాకంలో పవిత్రోత్సవాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నవంబర్ 2వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు మొదటికాల పూజతో పవిత్రోత్సవాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలు నవంబర్ 5వ తేదీ వరకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పవిత్రోత్సవాల్లో పరిసర గ్రామస్తులు, ఉభయకర్తలు పాల్గొంటారని చెప్పారు. భక్తులు పవిత్రోత్సవాలకు విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.



క్లుప్తంగా

నెమలిని రక్షించిన మహిళా రైతు



నెమలిని అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న రాధమ్మ

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంటకు చెందిన కె.రాధమ్మ అనే మహిళా రైతు మంగళవారం కుక్కల బారీనుంచి ఓ నెమలిని రక్షించి, సురక్షితంగా అటవీశాఖ అధికారులకు అప్పగించింది. వివరాల్లోకి వెళితే.. బూరగపల్లె సమీపంలోని శెట్టికుంట వద్ద పొలం పనులు చేసుకుంటున్న మహిళారైతు రాధమ్మ ఓ నెమలిపై కుక్కలు దాడి చేయడాన్ని గుర్తించింది. దీంతో ఆమె శునకాల బారి నుంచి నెమలిని రక్షించి, తన వెంట తీసుకువెళ్లి, ఎఫ్‌బీఓ మునిరాజకు అప్పగించింది. అనంతరం నెమలిని సమీపంలోని అంకాలమ్మ కొండలో వదిలి వేసినట్లు మునిరాజ తెలిపారు. నెమలిని రక్షించిన రాధమ్మను గ్రామస్తులు, అటవీశాఖ అధికారులు అభినందించారు.

యువతకు ఉచిత శిక్షణ

రేణిగుంట: అమరరాజ సంస్థ సహకారంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూతలపట్టు మండలం పేటమిట్టలో నిర్వహిస్తున్న అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ప్రతినిధి వి.కల్యాణ్ శనివారం తెలిపారు. 33వ బ్యాచ్‌కు ఇవ్వనున్న శిక్షణకు సంబంధించి నవంబర్ 4వ తేదీలోపు అడ్మిషన్లు పొందాలన్నారు. టెన్త్, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు తొలి మూడు నెలలు రూ.7,500, తర్వాత 21నెలలపాటు రూ.11,453 నుంచి రూ.11,853 వరకు ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు చెప్పారు. రెండేళ్లపాటు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుందన్నారు. వివరాలకు 9000024919, 91004 77371 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పెద్దపంజాణి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పలమనేరు–పుంగనూరు జాతీయ రహదారిలోని ముత్తుకూరు క్రాస్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథ్ కథనం మేరకు.. మండలంలోని సంపల్లెకు చెందిన ఖాసీంసాబ్ కుమారుడు ఖాదర్ వల్లి(54) సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో ఉదయం మండల కేంద్రమైన పెద్దపంజాణికి వెళ్లాడు. పని ముగించుకుని స్వగ్రామమైన సంపల్లెకు వెళుతుండగా మార్గం మధ్యలోని ప్రీమియం ఫీడ్ ఫ్యాక్టర్ సమీపంలో పలమనేరుకు వెళుతున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

మున్సిపల్ చైర్మన్ కారు అద్దాలు ధ్వంసం



కుప్పంరూరల్: గుర్తు తెలియని అగంతకులు కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్ ఇన్నోవా కారు అద్దాలను ధ్వంసం చేశారు. మంగళవారం సాయంత్రం తన నర్సింగ్ హోమ్ సమీపంలోని సిబ్బంది క్వార్టర్స్ వద్ద ఉంచిన ఇన్నోవా కారు వెనుక వైపు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అక్కడికి సమీపంలోని సీసీ కెమెరాల్లో వెతికినా అగంతకుడి ఫొటో సక్రమంగా కనిపించలేదని, ఎవరో టీడీపీ మూకల పనేనని మున్సిపల్ చైర్మన్ సుధీర్ అనుమానిస్తున్నారు. ఈ మేరకు కుప్పం పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు.

బతుకు కూడలి

ఇల్లు కట్టి చూడు...పెళ్లి చేసి చూడు అంటుంటారు పెద్దలు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇల్లు కట్టడం కొంత కష్టంతో కూడుకున్నపనే. ప్రధానంగా నేడు తాపీ మేస్త్రీలు, కూలీలు దొరకడం గగనంగా మారింది. అయితే అందుకు ఇబ్బంది లేకుండా చిత్తూరు మార్కెట్ చౌక్ భవన నిర్మాణ కార్మికులను సరఫరా చేస్తోంది. కష్టజీవులకూ కడుపు నింపుతోంది. - చిత్తూరు రూరల్

- భవన నిర్మాణ కార్మికుల అడ్డా చిత్తూరు మార్కెట్ చౌక్
- రోజూ సుమారు 700మందితో చౌక్ కిటకిట
- నిత్యం పనుల కోసం ఎదురుచూపు



▪ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీనివాసులు. చిత్తూరు నగరవాసి. ఇతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మేస్త్రీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. 35 ఏళ్లుగా మార్కెట్ చౌక్‌ను కేంద్రంగా చేసుకుని పని వెతుకుంటున్నాడు. చౌక్ నమ్ముకుని పూట గడుపుకుంటున్నామని శ్రీనివాసులు పేర్కొన్నాడు.



▪ నాగరాజు తమిళనాడులోని పరదరామివాసి. ఐదేళ్లుగా చిత్తూరు మార్కెట్ చౌక్‌కు వచ్చి పనులు వెతుక్కుంటున్నాడు. ఉదయం 5 గంటలకే లేచి చిత్తూరుకు పయనమవుతున్నాడు. మార్కెట్ చౌక్‌లో పని కోసం ముందు వరుసలో నిలబడుతున్నాడు. పని పూర్తి చేసుకుని రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుకుంటున్నాడు.



చిత్తూరు మార్కెట్ చౌక్‌లో కూలీలు

భవన నిర్మాణాలకు ఎంత మంది కూలీలు కావాలన్నా చిత్తూరు మార్కెట్ చౌక్ వెళితే సులువుగా దొరుకుతారు. భవన నిర్మాణ యజమానులకు కార్మికుల కొరత తీర్చే కూడలిగా ఈ సెంటర్ ప్రసిద్ధి చెందింది. శ్రమజీవులకు కడుపు నింపే ప్రాంతంగా పేరుంది. చిత్తూరు జిల్లా కేంద్రంలోని మార్కెట్ చౌక్ తాపీ కూలీల అడ్డా. ఇక్కడ తాపీ మేస్త్రీలు, సిమెంట్ కలిపే కూలీలు, ఇటుకలు, సిమెంట్ ఎత్తిచ్చేవారు, పైఅంతస్తుకు ఇసుక, ఇటుకరాళ్లు డంప్ చేసేవారు, సిమెంట్..ఇసుక..కంకర కలిపే మిషన్ ఆపరేటర్లు, కమ్మీ కట్టే వారు, గుంతలు తవ్వే వారు, పునాది రాళ్లు కట్టేవాళ్లు, టైల్స్, గ్రానైట్ వేసే కూలీలు, పైపులు బిగించేవారు, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ ఇలా పలురకాలుగా భవన నిర్మాణ కార్మికులు చౌక్‌లో ఉదయమే వచ్చి ఇక్కడ ఉంటున్నారు. గతంలో ఈచౌక్‌ను ఆశ్రయించే కూలీలు 500 మంది ఉండేవారు. ప్రస్తుతం ఈ సంఖ్య 700 మందికి పెరిగింది. వీరంతా చిత్తూరు నగర వాసులే కాకుండా చిత్తూరు మండలం, యాదమరి, బంగారుపాళెం, పూతలపట్టు, గుడిపాల, పెనుమూరు, తవణంపల్లె, ఐరాల, జీడీనెల్లూరు, పలమనేరు, తమిళనాడులోని పరదారామి, కాట్పాడి తదితర ప్రాంతాల నుంచి మార్కెట్ చౌక్‌కు తెల్లారేసరికి వచ్చి, పనుల కోసం ఎదురు చూస్తుంటారు.

కోడి కూయక ముందే..

కోడి కూయకముందే సుదూర ప్రాంతాల నుంచి చిత్తూరు మార్కెట్ చౌక్‌కు భవన నిర్మాణ కార్మికులు పరుగు పెడుతుంటారు. ఆ సమయానికి అల్పాహారం, మధ్యాహ్నానికి భోజనం చేసుకుని, తమ వెంట పెట్టుకుని చకచక వచ్చేస్తున్నారు. ఈ కూడలిలో రోడ్డుకిరువైపులా వందలాది మంది నిలబడి ఉంటారు. దీంతో ఆ ప్రాంతం కార్మికులతో కిటకిటలాడుతుంటోంది. 9.30 గంటలకు వరకు ఆ ప్రాంతం నిత్యం కూలీలతో రద్దీగా కనిపిస్తోంది. అక్కడి నుంచి పనులకు వెళ్లిన కూలీలు సాయంత్రం 5.30 గంటలకు పనులను ముగించుకుని రాత్రి 7 నుంచి 8 గంటల ప్రాంతాల్లో ఇంటికి చేరుకుంటున్నారు.

మహిళలు కూడా అధికమే...

భవన నిర్మాణ కార్మికుల్లో అధికంగా పురుషులు ఉంటారంటే పొరపాటే. మహిళలు కూడా పురుషులకు సమాన సంఖ్యలో పనులకు వెళుతున్నారు. వీరు సైతం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి బతుకుదెరువు కోసం వస్తున్నారు. ఇక్కడి నుంచి పనులకు వెళ్లి, బతుకు బండినడుపుతున్నారు.

కడుపు నింపుతోంది



చిత్తూరు మార్కెట్ చౌక్ మా కడుపునింపుతోంది. అప్పుడప్పుడు పనులు దొరికేది కష్టతరంగా ఉంది. అలాంటప్పుడు ఇబ్బందులు తప్పవు. వేచి చూసి ఇంటి కి వెళుతున్నాం. రోజుకు రూ. 500 నుంచి రూ. వెయ్యి వరకు సంపాదించే వారున్నారు. ఏళ్ల తరబడి ఈ చౌక్‌ను నమ్ముకుని బతుకుతున్నాం. కొన్నేళ్లుగా నిత్యం ఇక్కడికి వస్తున్నాం. ఇక్కడి నుంచి పనులకు వెళ్లి, సాయంత్రం తిరిగి మా గూడు చేరుకుంటున్నాం.

- కుమార్, చిత్తూరు నగరం

కొన్నేళ్లుగా ఇక్కడి నుంచే పనికి..



కొన్నేళ్లుగా నా భర్తతో కలిసి చౌక్ వచ్చి పని చూసుకుంటున్నాం. పురుషులతో సమానంగా పనులు చేస్తున్నాం. పనికి వెళితే దినసరి కూలీ గిట్టుబాటు అయ్యేలా చూస్తాం. కూలీల కోసం వెతుక్కొన్ని వచ్చే భవన నిర్మాణ యజమానులు ఉన్నారు. ఇప్పుడు వైఎస్సార్ జగనన్న ఇళ్ల నిర్మాణం, చిత్తూరులో పెద్ద పెద్ద భవనాలు కట్టే వారి సంఖ్య పెరిగింది. దీంతో మాకు పనులు దొరుకుతున్నాయి.

-సెల్వి, చిత్తూరు నగరం

మీ ఇంటి ఆడబిడ్డను ఆదరించండి



కుప్పంలో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్ సతీమణి శ్రీమతి దుర్గ

- ఎమ్మెల్సీ భరత్ సతీమణి శ్రీమతి దుర్గ

కుప్పం: 'పదేళ్లుగా కుప్పం ప్రజల సేవలో మా కుటుంబం నిమగ్నమైంది. మీ ఇంటి ఆడబిడ్డను సారెతో మీ ఇంటికి వచ్చాను. నాతోపాటు మీ అందరిలో ఒకడిగా ఉన్న నా భర్త, ఎమ్మెల్సీ భరత్‌ను ఆదరించండి.' అని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కుప్పం వాసులను కోరారు. సోమవారం మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో 'జనం కోసం జగన్– భరత్ కోసం మనం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ భరత్ సతీమణి ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ, చీర పెట్టి మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రవేశ పెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు అర్హులైన కుప్పం ప్రజలకు ప్రతి ఒక్కరికీ చేరాలన్న లక్ష్యంతో ఎమ్మెల్సీ భరత్ నిరంతరం కష్టపడుతున్నారని చెప్పారు. అంతేకాకుండా కుప్పంలోనే నివసిస్తూ అందరికీ అందుబాటులో ఉన్న ఏకైక ప్రజా నాయకులు భరత్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు పరిష్కరించడమే కాకుండా కాకుండా, ప్రజలందరికీ తోడుగా నిలిచి అందరివాడయ్యాడన్నారు. రాజకీయ అనుభవం లేకపోయినా యుక్త వయస్సులో తండ్రి చంద్రమౌళి ఆశయం కోసం, కుప్పం ప్రజలకు సేవ చేసేందుకు తన భర్త భరత్ నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. ఆయన్ని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని ఆమె కోరారు. కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇల్లూ తన పుట్టినిల్లు లాంటిదని, మీ ఆడపడచు కోరిక తీరుస్తారని మనసారా కోరుకుంటున్నానని అన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రేపు చిత్తూరులో ట్రాఫిక్ మళ్లింపు

చిత్తూరు అర్బన్: నగరంలో గురువారం జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రలో భాగంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్డిగుంట నుంచి వచ్చే అన్ని వాహనాలు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా రిజర్వు ఫారెస్టు రోడ్డు నుంచి కొంగారెడ్డిపల్లె వైపు వెళ్లాలన్నారు. వరిగపల్లె నుంచి వచ్చే వాహనాలు దర్గా కూడలి వైపు, సాంబయ్య కండ్రిగ నుంచి వచ్చే వాహనాలు కట్టమంచి వైపు వెళ్లాలన్నారు. అలాగే సభకు గుడిపాల నుంచి వచ్చే వాహనాలు కణ్ణన్ కళాశాల మైదానంలో, కొంగారెడ్డిపల్లె నుంచి వచ్చేవారు లక్ష్మీనగర్ కాలనీలోని బీటీ.కాంపౌండ్ వద్ద, యాదమరి నుంచి వచ్చే వాహనాలు ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద పార్కింగ్ చేయాలని కోరారు.

4న విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విభిన్న ప్రతిభావంతులకు నవంబర్ 4 న ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు.జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ, యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను జిల్లా కేంద్రంలోని రాస్ వయోవృద్ధుల ఆశ్రమం (తపోవనం ఎదురుగా) నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనదలచిన విభిన్న ప్రతిభావంతులు పదవ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. బధిరులు, అంధులు, శారీరక వికలాంగులు పాల్గొనవచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా, ఆధార్ కార్డుతో హాజరుకావాలని, ఇతర వివరాలకు 9392923884 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

పలమనేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 3వ తేదీన పట్టణంలోని గుండుబావి ఎదురుగా ఉండే శ్రీపద్మావతి, వాణి డిగ్రీ కళాశాలల్లో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులులు సూచించారు. మంగళవారం వారు వి.కోట మండలంలో జాబ్‌మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాల ఆధారంగా రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు నెలకు వేతనం ఉంటుందని చెప్పారు. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం 79898 42026, 95056 01887 నంబర్లలో సంప్రదించాలన్నారు. నిరుద్యోగులు మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

ఉక్కు మనిషికి నివాళి



పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉక్కుమనిషి సర్దార్ వల్లబాయ్‌పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం జెడ్పీ కార్యాలయంలో పుష్పాంజలి ఘటించారు. ఆయన చిత్రపటానికి సీఈఓ ప్రభాకర్‌రెడ్డి నివాళులర్పించి, మాట్లాడారు. పటేల్ భారతదేశంలోని 565 సంస్థానాలను ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. సివిల్ సర్వీసెస్ ఏర్పాటుకు నాంది పలికారన్నారు. దేశ ఐక్యత కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. సంక్లిష్ట సమయంలో దేశ సమైక్యత కోసం ఆయన తీసుకున్న నిర్ణయాలు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో డీపీఆర్సీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతి

ఎంపీడీఓ నుంచి డీఎల్‌డీఓగా ఉద్యోగోన్నతి పొందినవారిని జెడ్పీ కార్యాలయంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం సన్మానించారు. వెదురుకుప్పం ఎంపీడీఓ సుధాకరరావు, తిరుపతి రూరల్ ఎంపీడీఓ వెంకటనారాయణ, జీడీనెల్లూరు ఎంపీడీఓ శ్రీదేవి డీఎల్‌డీఓగా ఉద్యోగోన్నతి పొందారు. వారిని సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి



అమర వీరులకు నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

చిత్తూరుఅర్బన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు జిల్లా పోలీసుశాఖ కొవ్వొత్తులతో నివాళులర్పించింది. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిత్తూరులో పోలీసు అధికారులు కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. గాంధీ విగ్రహం వద్ద అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ బ్యాండ్ మేళాలు వాయిస్తూ, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పోలీసు అధికారులకు మద్దతుగా పలువురు విద్యార్థులు, యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ముడు రిజర్వు ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, మురళీధర్, విష్ణురఘువీర్, బాబు ప్రసాద్, సీఐలు విశ్వనాథరెడ్డి, మద్దయ్య ఆచారి, శ్రీనివాస్, ఆర్ఐ మధు, నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ రాఘవరెడ్డి

పుంగనూరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గత నెల 20వ తేదీ జరిగిన హత్యకేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. సీఐ మంగళవారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన సంజయ్‌మోహిత్(25) మండలంలోని చదళ్ల గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ ఇక్కడే ఉన్నాడు. ఈ క్రమంలో సంజయ్‌మోహిత్ మద్యం తాగి భార్యతో గొడవ పడి వచ్చి, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఉన్నాడు. ఆ రోజు రాత్రి పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన బాబు, రామసముద్రం మండలం గోసువారిపల్లెకు చెందిన నారాయణరెడ్డి పనులకు వెళ్లి బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ సంజయ్‌మోహిత్ తాగి మత్తులో నారాయణరెడ్డి, బాబుతో గొడవ పడ్డాడు. దీంతో వారిద్దరు కలసి అతనిని చీర, వైర్లతో కట్టి, బస్టాండ్‌లో బెంచీపై పడుకోబెట్టి, గొంతునులిమి హత్య చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

ఆగని గజదాడులు ..భారీగా పంట నష్టం



దేశిరెడ్డిగారిపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన అరటి తోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీలో పంటలపై ఏనుగులు వరుస దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి దేశిరెడ్డిగారిపల్లెలో పంట పొలాలపై ఏనుగులు గుంపుగా దాడి చేసి భారీగా పంట నష్టం చేశాయి. సుమారు ఏడు ఏనుగులు గుంపుగా కోతకు వచ్చిన వరి, టమాట, అరటి, మామిడి, మొక్కజొన్న పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే డ్రిప్‌పైపులను కూడా ధ్వంసం చేశాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ఏనుగుల బారి నుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

చోరీ కేసులో యువకుడికి ఆరునెలల జైలు

పుంగనూరు: పట్టణంలో మోటారు సైకిల్ చోరీ కేసులో దాసరి రాము(21) యువకుడికి ఆరునెలలు జైలు శిక్ష విధిస్తూ మొదటి అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధు మంగళవారం సాయంత్రం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన గంగులప్ప కుమారుడు దాసరి రాము పట్టణంలో మోటారు సైకిల్ దొంగతనానికి పాల్పడ్డాడు. దీనిపై అప్పటి ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి, నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ రామకృష్ణ సాక్షాధారాలను కోర్టుకు నివేదించారు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడికి ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి సింధు తీర్పు చెప్పారు.

వి.కోటలో తమిళనాడు వాసి ఆత్మహత్య

వి.కోట: మండల కేంద్రంలో తమిళనాడు వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి మాదేపల్లెకు చెందిన శక్తి కుమారుడు గోవిందరాజులు(40) వి.కోటలోని ఓ బేకరిలో మాస్టర్‌గా విధులు నిర్వహిస్తూ నారాయణనగర్‌లో ఆవులప్ప ఇంట్లో అద్దెకు కాపురం ఉన్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం తాను కాపురం ఉంటున్న అద్దె ఇంట్లో ఉరి వేసుకున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629

Real Estate


■ శ్రీకాళహస్తి సమీపంలో 30 ఎకరాల మామిడి తోట పొలం కలదు. ఇందులో 11 సెంట్లు రూ.7 లక్షలు మాత్రమే. హామీ ఇవ్వబడిన ప్రకారం నెలవారీ రూ.5000/- (3 సం॥) రాబడిని పొందండి. సెల్: 80192 77811.

PLOT FOR SALE
■ రేణిగుంట టౌన్‌లో రెసిడెన్షియల్ ప్లాట్ 25 అడుగుల రోడ్డు 35x50 అడుగుల ప్లాట్ అమ్మకంనకు కలదు. త్రాగు నీటి వసతి కలదు. సంప్ర: 7097670933.

■ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ల నందు ప్లాట్లు (30X50 41 అం.) అం. రూ. 9,000మే. SQFT రూ.250 ప్రతి కస్టమర్‌కి బంగారం 1 గ్రా. నుంచి 20 గ్రా. ల ఉచిత బహుమతి కలదు. కె.వెంకటాద్రి,M.D. 9908537563.

■ రంగంపేట, మోహన్‌బాబు యూనివర్శిటీకి ఎదురుగా తక్షణమే గృహ నిర్మాణానికి/కమర్షియల్ పరంగా అనుకూలమైన తుడా అప్రూవల్ ప్లాట్లు అమ్మబడును. 98661 66111.

BUSINESS SERVICE



BUSINESS OFFER
■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact: for more info: 7989655248

TOURS & TRAVELS



■ రామమూర్తి యాత్ర స్పెషల్, తిరుపతి. అయ్యప్పస్వామి యాత్రలు 2+2, 4 రోజులు రూ.4100, తేదీలు: 16/11, 21/11, 2/12, 7/12, 12/12, 17/12, భవాని, గురువాయురు, శబరిమల, కన్యాకుమారి, మధరై, పళని 11 ప్రదేశాలు తిలకించు యాత్ర. సంప్ర: 9441891921, 9396243700.

Wanted

■ Wanted Lady Receptionists 10/Inter/Degree, Contact: Dr.Prasad, Suhas Dental Care, Opp. Chillies Restaurant, Air Bypass Road, Tirupati, 9703511444.

■ తిరుపతిలో ప్రముఖ సంస్థలో పనిచేయుటకు 6 సం.లు అనుభవం కల్గిన డ్రైవర్లు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత.✆ 8019450540, 6300677131.

■ తిరుపతిలో పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు M/F మరియు సర్వీస్ బాయ్స్, వాచ్‌మెన్, స్వీపర్ కావలెను. సంప్ర: 9704433832, 8317559971

■ మ్యారేజ్ ఆఫీస్‌కు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్ Customer Relationship Manager కావలెను. Q:Inter,డిగ్రీ,జీ:12,000-15,000+Incentives, only Females (Work Officeలో మాత్రమే). V.V.మహల్‌రోడ్, తిరుపతి,✆ 99594 45978

■ తిరుపతిలో ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు అనుభవం కల్గిన స్టోర్ సూపర్‌వైజర్స్-12K, డ్రైవర్-17K కిచెన్ సూపర్‌వైజర్స్-14K, ప్లంబర్ &ఎలక్ట్రీషియన్-15K,క్యాషియర్స్-12Kకావలెను. వసతి కలదు. 7794955995, 9949284246.

■ Wanted Drivers, Electricians, Plumbers, Office Attenders. Contact : Sri Mathrudevi Viswashanthi Ashram, Penchalakona, Rapur Mandal, SPSR Nellore(Dt.), Cell: 94943 00666.

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుటకు వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573833520, 9059633520.

■ పప్పులెస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ:15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd, Ph: 8919613984

■ తిరుపతి నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F), కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను.ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర: 9100671117, 9533724777.

■ V Software HR Solutions and Software నందు పని చేయుటకు గ్రాడ్యుయేట్ గల అభ్యర్థులు కావలెను. వివరములకు సంప్రదించండి: 85025 77460, 96405 99309.

■ Wanted Male Receptionists, Supervisors, Accountants & Clerks. Contact: Sri Mathrudevi Viswshanthi Ashram, Penchala kona, Rapur Mandal, SPSR Nellore(Dt.), Email : resumetosmva-trust12@gmail.com, Cell: 97051 86006.

■ సూళ్లూరుపేట దగ్గర ప్రముఖ పరిశ్రమలో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్, సివిల్ వర్క్ హెల్పర్స్ మరియు ప్యాకింగ్ లో పనిచేయుటకు ఆడవారు కావలెను. సంప్ర॥ 8978259071, 8096262777, 98489 77496, 81427 61777

■ ప్రముఖ Online Shopping APPకి మండలాల వారిగా Distributors మరియు Delivery Boy'sకావలెను.వివరములకు సంప్రదించండి: 75699 91714, 99890 39051.

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/9640400073

■ రామకృష్ణ గ్రూప్స్, (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్లలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91608 91122, 92814 52838

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926

■ ప్రముఖ విద్యా సంస్థ నందు Admissions చేయుటకు Marketing Executives కావలెను. Salary & Incentives. ✆ 88855 47887

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేటా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాలుగులైన్ల ప్రకటనకు రూ. :375/-
అదనపు లైనుకు రూ.: 90/-
CONTACT : 9440166091, 9951602970